సాక్షి ఖమ్మం

శనివారం । 4 । జనవరి । 2025



ఎన్నాళ్లో వేచిన ఉదయం!

జల వనరుల శాఖలో పదోన్నతులు, బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఖాళీ భర్తీ అవుతాయని భావిస్తున్నారు. 10లో



గిరిజన పాఠశాలల్లో వసతులు

గిరిజన పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన వసతుల కల్పనకు ప్రణాళిక సిద్ధమైందని ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. 12లో

గరిష్టం / కనిష్టం
30° / 15°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం, రాత్రి చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

కేసీఆర్, కేటీఆర్‌ను కలిసిన ఎంపీ వద్దిరాజు



మాజీ సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ సీఎం కేసీఆర్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం ఎర్రవెల్లిలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎంపీ కలిశారు. ఇక మాజీ మంత్రి హరీశ్‌రావును ఎమ్మెల్సీ మధు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్

ఖమ్మం రాపర్తి నగర్: ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్‌ను శనివారం నిర్వహించనున్నారు. ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమం ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణారావు తెలిపారు. ఈసందర్భంగా వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, పోస్టర్ పెయింటింగ్‌తో పాటు సాంస్కృతిక అంశాల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొననుండగా, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అధిక సంఖ్యలో హాజరుకావాలని సూచించారు.

పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు పాటుపడాలి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యాన చేపడుతున్న పనులతో పాటు పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న లైట్లను తెలంగాణ రెడ్కో సమన్వయంగా ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటుచేయాలని సూచించారు. అలాగే, కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, విద్యార్థుల విమార యాత్రలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులు, బిల్లుల చెల్లింపుపై సమీక్షించారు. కాగా, ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో సత్తా చాటేలా ప్రత్యేక తరగతులను నిర్వహించాలని సూచించారు. ఈసమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఈఓ సోమశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఖమ్మంక్రైం: సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యాన ఎవరైనా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. జిల్లా కేంద్రం నుంచి శుక్రవారం ఆయన పోలీసు అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కోడిపందేల నియంత్రణకు డివిజన్, మండల, గ్రామస్థాయిలో బృందాలను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. పందేల్లో పాల్గొన్న వారితో పాటు నిర్వహణకు తోటలు, గెస్ట్ హౌస్‌లు ఇచ్చిన వారిపైనా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తొలుత గత ఏడాది కోడిపందేలు నిర్వహించిన వారు, కత్తులు కట్టే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని సీపీ సూచించారు.

చైనా మాంజా అమ్మొద్దు

ప్రజలు, పక్షుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న చైనా మాంజా అమ్మిన, నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. ఈ విషయమై ఎస్‌హెచ్‌ఓలు తనిఖీలు చేపట్టి షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రజలు సైతం ఈ మాంజా వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

వయోజన విద్య డీడీగా అనిల్‌కుమార్



ఖమ్మం సహకారనగర్: వయోజన విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా అనిల్ కుమార్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ డీడీగా విధులు నిర్వర్తించిన జయశంకర్ ఉద్యోగ విరమణ చేశారు. దీంతో భద్రాద్రి కొత్తగూడెంలో ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న అనిల్‌కు ఖమ్మం డీడీగా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



జీవితాలతో ఆట

యువత ఉసురు తీస్తున్న ఆన్‌లైన్ గేమ్‌లు

- సులభంగా డబ్బు సంపాదించొచ్చని అప్పులు, ఆపై ఆత్మహత్యలు
- అవగాహన లేక ఊబిలోకి దిగుతున్న పలువురు
- పోలీసులు దృష్టి సారిస్తేనే కట్టడికి అవకాశం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలుగా మారుతున్న పలువురు యువత చివరకు తమ జీవితమనే ఆటలో ఓడిపోతున్నారు. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండడంతో సరదాగా గేమ్స్ మొదలుపెట్టి ఆతర్వాత వ్యసనంగా మార్చుకుంటున్నారు. ఒక్కోసారి డబ్బు వస్తుండడంతో మరింత డబ్బు సులభంగా సంపాదించొచ్చనే భావనతో అప్పులు తెచ్చి మరీ ఆడుతుండగా ఆతర్వాత డబ్బు రావడం లేదు. దీంతో పోయిన చోటే వెతుక్కోవాలనే ఆశతో మరిన్ని అప్పులు చేస్తూ తీర్చే మార్గం లేక బలవన్మరణానికి పాల్పడుతున్నారు.

యథాలాపంగా మొదలై..

ఫోన్‌లో సరదాగా ఆడేందుకు ప్రయత్నిస్తున్న వారిని ఆన్‌లైన్ గేమ్స్ ఆకర్షిస్తున్నాయి. ఫోన్ చూస్తున్న క్రమాన ఆన్‌లైన్ రమ్మీ, బెట్టింగ్ యాప్స్, సైట్స్ కనిపిస్తున్నాయి. తొలుత ఇవి ఆడడం మొదలుపెట్టిన వారికి డబ్బు రావడంతో కిక్ వస్తోంది. ఆపై బానిసలుగా మారి గేమ్స్ ఆడకుండా ఉండలేని స్థితికి చేరుతున్నారు. అలాగే, విద్యార్థులు, నిరుద్యోగులు ఆన్‌లైన్ గేమ్స్‌తో సులభంగా నగదు సంపాదించాలని ప్రారంభించి అప్పుల పాలవుతుండడం గమనార్హం. తొలుత తక్కువ డబ్బు పెట్టి ఆడితే లాభాలు వస్తున్నా, ఆపై ఆశతో మరింత డబ్బు పెడితే రూ.లక్షల్లో నష్టపోతున్నారు. కొన్ని సైట్లలో డబ్బు గెలిచినా వాటిని తీసుకునేందుకు సవాలక్ష నిబంధనలు పెడుతున్నారు. ఈ నగదు తీసుకోవడానికి మరో ఆట ఆడి ఆడాలని చెబుతుండడంతో వచ్చిన డబ్బు తీసుకోవడానికి కూడా ఆడుతూ వెళ్తున్న పలువురు నష్టాల పాలవుతున్నారు.

అప్పుల ఊబిలోకి..

ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటుపడిన యువత అప్పుల పాలవుతోంది. ఎక్కువగా విద్యార్థులు, నిరుద్యోగులు ఈ ఆటలు ఆడుతుండటంతో వారి వద్ద డబ్బులు లేకున్నా ఆడాలనే కుతూహలంతో ఇతరుల వద్ద అప్పులు చేస్తున్నారు. అవి కూడా పోవడంతో మళ్లీ కొత్త అప్పులు చేయడం.. అలా పెరుగుతూ వెళ్తండగా చివరకు తీర్చలేని పరిస్థితి ఎదురవుతోంది. కొందరు కుటుంబీకుల సాయంతో ఈ ఊబి నుంచి బయటపడుతున్నా మరికొందరు ఎవరికీ చెప్పకుండా తమలో తాము కుంగిపోతున్నారు.

సమయం చిక్కితే అదే ధ్యాస

జిల్లాలో చాలామంది ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలుగా మారినట్లు తెలుస్తోంది. నిమిషం ఖాళీ దొరికినా పక్కకు వెళ్లి గేమ్స్ ఆడడం బస్టాండ్లు, విద్యాసంస్థల సమీపంలోని కేఫ్‌లు, పార్క్‌ల్లో కనిపిస్తోంది. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్‌లతో యువత బంగారు భవిష్యత్ నాశనమవుతుండగా పలువురు అప్పుల పాలయ్యారు. అయితే, నగదు పోగొట్టుకున్నా, అప్పులు పెరిగినా మళ్లీ గేమ్స్ ద్వారానే పోయిన సొమ్ము రాబట్టుకోవాలనే ఉద్దేశంతో వదలడం లేదని తెలుస్తోంది.

కూసుమంచి మండలం గైగోళ్లపల్లికి చెందిన ఉపేందర్ కూరగాయల వ్యాపారం చేయడంతో పాటు ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడిన ఆయన డబ్బు పోగొట్టుకున్నాడు. కుటుంబీకులు పలుమార్లు మందలించినా మార్పు రాలేదు. ఆ తర్వాత మరింతగా డబ్బు పోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇలాంటి ఘటనలు జిల్లాలో మరికొన్ని కూడా చోటుచేసుకున్నాయి.

అవగాహనే అసలైన మందు..

ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న గేమ్స్ యాప్‌లు, సైట్లలో చాలా వాటికి అనుమతి ఉండదు. ఈనేపథ్యాన పోలీసు శాఖ దృష్టి సారిస్తే యువతను ఊబి నుంచి బయటపడేసే అవకాశం లభిస్తుంది. ఇప్పటివరకు సాంకేతికంగా జరిగే మోసాలపైనే పోలీసులు దృష్టి పెడుతున్నారు. సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నట్లుగానే వీటి కంటే ప్రమాదకరమైన ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్‌లపై కూడా విస్తృత ప్రచారం చేస్తే యువతను కాపాడుకోవచ్చని పలువురు చెబుతున్నారు. అంతేకాక తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు సెల్‌ఫోన్ ద్వారా ఏం చేస్తున్నారనే అంశంపై ఓ కన్నేసి ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు.

సంక్రాంతిలోగా ఇళ్ల పంపిణీ



డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి తదితరులు

- పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లపై దృష్టి సారించండి
- సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

ఖమ్మంసహకారనగర్: గతంలోనే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను సంక్రాంతిలోగా అర్హులకు అందజేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం అర్బన్ మండలంలోని మల్లెమడుగులో 84, కూసుమంచి మండలం దుబ్బ తండా(ఎర్రగడ్డ తండా)లో 29, నేలకొండపల్లి మండలం ఆచర్లగూడెంలో 18 ఇళ్ల కోసం నిరుపేదలను ఎంపిక చేయాలని తెలిపారు. అలాగే, పాలేరు నియోజకవర్గ పరిధిలో 209 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వివిధ దశల్లో ఉన్నందున త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఇదే సమయాన అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతాయనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఖమ్మంరూరల్: ప్రజల దీవెనలతో ఏర్పడిన తమ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మండలంలోని ఎం.వెంకటాయపాలెం, కాచిరాజుగూడెం, చింతపల్లిలో సీసీరోడ్ల నిర్మాణానికి ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి పేదల సొంత ఇంటి కలను తీర్చే బాధ్యత తమదేనని చెప్పారు. ఎం.వెంకటాయపాలెంలో రోడ్ల కోసం రూ.కోటి నిధులు కేటాయించామని, ఎం.వెంకటాయపాలెం నుంచి గోళ్లపాడు వరకు బీటీ రోడ్డు మంజూరైందని తెలిపారు. ఈ సమావేశాల్లో ఆర్డీఓ నర్సింహారావు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ హేమలత, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్‌తో పాటు తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో ఎయిర్‌పోర్టు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలో ఆరు నెలల్లోగా ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకోసం కొత్తగూడెంలోని రామవరం, రుద్రంపూర్ ప్రాంతంలోని సింగరేణి, అటవీ, ప్రైవేట్ భూములను పరిశీలిస్తున్నామని చెప్పారు. భద్రాద్రి జిల్లాలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌తో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. సుజాతనగర్, కొత్తగూడెంలో పనులను ప్రారంభించాక శ్రీ రామచంద్ర కళాశాలలో నిర్వహిస్తున్న రైఫిల్ షూటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడే నిర్వహించిన సావిత్రి బాయి పూలే జయంతి(మహిళా ఉపాధ్యాయ దినోత్సవం) సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో మౌలిక వసతులు కల్పిస్తామని, కొత్తగూడెంలో ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

హామీలు నెరవేరుస్తున్నాం..

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించిన మంత్రి పొంగులేటి.. భూమి ఉన్న ప్రతీ రైతుకు చట్టభద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా హామీలు నెరవేర్చడంలో వెనుకడుగు వేయడం లేదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామని, సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో రూ. 675 కోట్లతో మౌలిక వసతులు కల్పించామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. అంతేకాక విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచామని మంత్రి వెల్లడించారు.

పోలీసు వ్యవస్థకు వన్నె తీసుకురావాలి

- కమిషనర్ సునీల్‌దత్
- గంగారం బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్



శిక్షణలో ప్రతిభ చూపిన కానిస్టేబుల్‌కు ట్రోఫీ అందజేస్తున్న సీపీ సునీల్‌దత్



కవాతు చేస్తున్న బెటాలియన్ కానిస్టేబుళ్లు

సత్తుపల్లి టౌన్: విధినిర్వహణలో అంకితభావం, ధైర్యసాహసాలు, శ్రద్ధ కనబరుస్తూ పోలీసు వ్యవస్థకు వన్నె తీసుకొచ్చేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ ప్రత్యేక బెటాలియన్‌లో 297 మంది కానిస్టేబుళ్లకు తొమ్మిది నెలలుగా ఇస్తున్న శిక్షణ పూర్తయింది. ఈ సందర్భంగా పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించగా వారి నుంచి సీపీ, బెటాలియన్ కమాండెంట్ పి.చటర్జీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాల్లో విధుల్లో అమలుచేస్తూ రాణించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ చట్టాలకు అనుగుణంగా నిజాయితీగా విధులు నిర్వర్తిస్తే శాఖతో పాటు వ్యక్తిగతంగా పేరు వస్తుందని తెలిపారు. ఆతర్వాత శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి సీపీ బహుమతులు అందజేశారు. అడిషనల్ కమిషనర్ విజయ్‌బాబు, ఏసీపీ రఘు, బెటాలియన్ అసిస్టెంట్ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, అసిస్టెండ్ కమాండెంట్లు శ్రీధరరాజా, రంగారెడ్డి, సీఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లం అంటే భయం ఎందుకు?

- ఆరు నెలలు కష్టపడితే ధారాళంగా మాట్లాడొచ్చు
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



బాలిక ఆంగ్ల ఉపన్యాసాన్ని వింటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డీఈఓ సోమశేఖరశర్మ

కొణిజర్ల: విద్యార్థులు ఇంగ్లిష్‌పై భయాన్ని విడనాడాలని, తప్పులైనా నిత్యం మాట్లాడుతుంటే ఆరు నెలల్లో ధారాళంగా వస్తుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. తద్వారా పోటీ ప్రపంచంలో అన్ని అవకాశాలను సులువుగా అందుకోవచ్చని చెప్పారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఈఎల్‌టీఏ) ఆధ్వర్యాన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఇంగ్లిష్ నైపుణ్యాలను వెలికితీసేందుకు శుక్రవారం కొణిజర్లలో ఇంగ్లిష్ ఒలింపియాడ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ 8, 9వ తరగతుల విద్యార్థులకు ఓ అంశాన్ని కేటాయించి సంభాషణ చేయించారు. అనంతరం పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశాక కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని 34 ప్రభుత్వ పాఠశాలల్లో 6, 7వ తరగతుల బాలబాలికల కోసం 'వీ కెన్ లెర్న్' పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంతో మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సోమశేఖరశర్మ, తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, ఎంఈఓ డి.అబ్రహం, ఈఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి జగదీష్, ఉపాధ్యాయులు సంక్రాంతి రవికుమార్, యం భాస్కర్, శ్రీదేవి, రమేష్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం సహకారనగర్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఈఎల్‌టీఏ) ఆధ్వర్యాన ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించారు. ఒలింపియాడ్, వక్తృత్వ పోటీలను కన్వీనర్ ఏ.శాంతారెడ్డి, కోకన్వీనర్ స్నేహలత, హెచ్‌ఎం వి.శాంత ఆధ్వర్యాన నిర్వహించారు. ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాంబాబు, బండారి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా విజేతలకు బహుమతులు అందజేశారు.

త్వరలోనే మోడల్ మార్కెట్ పనులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దే త్వరలో మొదలుకానున్నాయి. రాష్ట్రంలో రెండో అతి పెద్దదైన ఈ మార్కెట్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ఖమ్మం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ.155.45 కోట్లు మంజూరు చేయించారు. ఈ మార్కెట్ మిర్చి అమ్మకాలు, కొనుగోళ్లకు ప్రఖ్యాతి సాధించగా ఇక్కడి వ్యాపారులు విదేశాలకు సైతం ఎగుమతి చేస్తారు. ఈమేరకు చేపట్టాల్సిన పనులపై మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు శుక్రవారం సమీక్షించారు. రానున్న మిర్చి సీజన్‌లో రైతులకు ఇబ్బంది ఎదురుకాకుండా చేపట్టాల్సిన పనులు, ప్రస్తుతం ఉన్న నిర్మాణాల తొలగింపుపై చర్చించారు. మార్కెటింగ్ శాఖ ఎస్ఈ లక్ష్మణ్‌గౌడ్, ఈఈ ఎల్లేష్‌తో పాటు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గ్రేడ్–2 కార్యదర్శి సుజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే క్షేమంగా ఇంటికి..

జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య



ప్రతిజ్ఞ చేయిస్తున్న పీడీ దివ్య

నేలకొండపల్లి: మైనర్లకు డ్రైవింగ్ ఇవ్వడం, నిబంధనలు పాటించకపోవడంతోనే రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయని జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య తెలిపారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి టోల్‌గేట్ వద్ద రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అందరికీ నిబంధనలపై అవగాహన ఉంటే ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని.. తద్వారా క్షేమంగా ఇళ్లకు చేరుకోవచ్చని చెప్పారు. తల్లిదండ్రులు సామాజిక బాధ్యతగా మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఆమె సూచించారు. అనంతరం వాహనదారులతో రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే మేనేజర్ కిరణ్, టోల్‌గేట్ ఉద్యోగులు శ్రీనివాసరెడ్డి, మోహన్‌సాయి, కిరణ్‌సాయి, ముఖేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

కొత్తబస్టాండ్, లకారం పనుల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను విజిలెన్స్ అధికారులు మరోసారి తనిఖీ చేశారు. మొత్తం 36 పనులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించిన అధికారులు ఇప్పటికే 33 పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన విషయం విదితమే. ఇక మరో మూడు పనులకు సంబంధించిన ఫైళ్లను ఇటీవల కేఎంసీ నుండి సేకరించిన విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఖమ్మంలో పర్యటించారు. ఈ సందర్భంగా లకారం ట్యాంక్‌బండ్ వద్ద చేపట్టిన వాకింగ్ ట్రాక్‌లు, కొత్త బస్టాండ్‌లో నిర్మాణాల నాణ్యతపై తనిఖీ చేశారు. త్వరలోనే మరోసారి పర్యటించనున్న విజిలెన్స్ బృందం గత ప్రభుత్వంలో పూర్తిచేసిన ఇంకొన్ని పనులను పరిశీలించనున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.

నరసింహావతారం.. నయనానందకరం

స్టేడియంలో స్వామి వారికి జేజేలు..



స్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకులు

భద్రాచలం: ప్రహ్లాదుడిపై భక్తిని చాటి, ఆయనను కాపాడుకునేందుకు హిరణ్యకశిపుడనే రాక్షసుని సంహరించేందుకు వెలిసిన స్వామివారి నరసింహావతారం నయనానందకరమంటూ భక్తులు జేజేలు పలికారు. వైకుంఠ ఏకాదశీ ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం నరసింహావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి మూలమూర్తులకు గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవలు నిర్వహించి ఆరాధన ఇచ్చారు. ఉత్సవ మూర్తులను నృసింహావతారంలో అలంకరించి బేడా మండపంలో కొలువుదీర్చి పూజలు జరిపారు. వేద పండితులచే రెండు వందల పాశురముల ప్రబంధాలు చదివారు. నరసింహావతారంలో ఉన్న స్వామిని ప్రత్యేక పల్లకీపై ఆలయం నుంచి ఊరేగింపుగా కోలాట ప్రదర్శనలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి మిథిలా స్టేడియంలో కొలువుదీర్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించగా, అర్చకులు అవతార విశిష్టతను వివరించారు. అనంతరం కల్యాణ మండపం నుంచి తాతగుడి వరకు తిరువీధి సేవకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. మార్గమధ్యలో విశ్రాంతి మండపంలో కొద్దిసేపు స్వామి సేద తీరాక రాజవీధి ద్వారా తాతగుడి వరకు చేరుకుని అక్కడ పూజలు అందుకున్నారు.

గ్రామరక్షకుడిగా స్వామివారు

గ్రామ రక్షణార్థం స్వామివారు నరసింహావతారంలో పురవీధుల గుండా తిరువీధి సేవ కొనసాగడం ఈ అవతారం ప్రత్యేకత అని వేదపండితులు తెలిపారు. గ్రామంలోకి దుష్టశక్తులు రాకుండా, ఆపదలు సంభవించకుండా ఉండేందుకే నరసింహావతారంలో స్వామివారు పట్టణంలోని పురవీధుల్లో సంచరిస్తారని వివరించారు. ఈ అవతారంలో రెండు ముఖాలు కలిగి ఉండి భక్తులకు దర్శనమివ్వటం విశిష్టత అని వేదపండితులు తెలిపారు. ఆ తర్వాత స్వామివారిని అంతరాలయానికి తీసుకెళ్లారు. పూజల్లో అర్చకులు, వేదపండితులు, సిబ్బందితో పాటు వందలాదిగా భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేయూ క్రికెట్ టోర్నీలో వరంగల్ జట్టు విజయం

ఖమ్మం స్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ ఖమ్మంలో శుక్రవారం మొదలైంది. మూడు రోజుల పాటు సాగే పోటీల్లో తొలిరోజు వరంగల్, ఆదిలా బాద్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు పరిమిత 30 ఓవర్లలో 25 ఓవర్లు మాత్రమే ఆడి 10 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. ఇందులో చరణ్ 48 పరుగులు చేయగా, వరంగల్ బౌలర్లలో ఇబ్రహీం మూడు, వరుణ్, ఫర్హాన్ రెండేసి వికెట్లు, హరిప్రసాద్ ఒక్క వికెట్ పడగొట్టారు. అనంతరం 105 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన వరంగల్ జట్టు కేవలం 10 ఓవర్లలో సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించి ఘనవిజయం సాధించింది. ఓపెనర్లలో వరుణ్ 30 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్స్ సాయంతో 54 పరుగులు చేయగా, రోహిత్ 25 బంతుల్లో ఆరు ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 41 పరుగులు చేశాడు.

రాష్ట్రస్థాయి కరాటే టోర్నీలో ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్ యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. వివిధ కేటగిరిల్లో ఖమ్మంకు చెందిన గోపతి గణేష్, సయ్యద్ సాల్లిహిన్, ఆదిల్‌పాషా, ఎస్.ప్రవీణ్‌కుమార్ ద్వితీయస్థానంలో, వి.వరుణ్ తృతీయ స్థానంలో నిలిచి పతకాలు దక్కించుకున్నారు. క్రీడాకారులను కోచ్‌లు గోపతి సైదులు, వి.పిచ్చయ్య, ఎస్.లోహిత్, సయ్యద్ మహబూబ్ పాషా, రాయకృష్ణ, ఎం.లీలప్రసన్న అభినందించారు.

రాష్ట్రస్థాయి బయాలజీ టాలెంట్ టెస్ట్



మహిళా ఉపాధ్యాయురాలు రూజీని సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని జిల్లా సైన్స్ మ్యూజియంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి బయాలజీ టాలెంట్ టెస్ట్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. ఇందులో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన సీహెచ్.భాష్య, పి.వెన్నెల, ఎం.జాషువా, కె.వెంకటశివతేజ పాల్గొన్నారు. పరీక్షను డీఎస్‌ఓడీ జగదీష్, టీబీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పెసర ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. టీబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శ్రీనివాసరావు, ఎం.డాన్ బోస్కోతో పాటు ఐ.రంజిత్‌కుమార్, బి.ప్రవీణ్ కుమార్, గైడ్ టీచర్లు పాల్గొన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురిని సన్మానించారు.

మోటార్‌సైకిల్‌పై శబరిమల యాత్ర



శబరిమల వెళ్తున్న వారితో భక్తులు

కారేపల్లి: మండలంలోని గుంపెల్లగూడెంకు చెందిన అయ్యప్ప మాలధారులు బానోత్ రమేష్, గుగులోత్ శ్యాం శుక్రవారం మోటార్ సైకిల్‌పై శబరిమల యాత్రకు బయలుదేరారు. సుమారు 1,200 కి.మీ. ప్రయాణం మూడు రోజుల్లో పూర్తవుతుందని వారు తెలిపారు.

వేధింపుల కేసులో వ్యక్తి రిమాండ్

ఏన్కూరు: విడాకులు తీసుకున్నాక కూడా మహిళను వేధిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రఫీ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యాకూబ్‌పాషా, షేక్ జుబేదా 14 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే, వివాహం జరిగాక నాలుగేళ్ల నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండడంతో విడాకులు తీసుకున్నారు. ఆపై జుబేదా ఏన్కూరులో టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తోంది. కాగా, తరచుగా ఆమె వద్దకు వస్తున్న యాకూబ్‌పాషా డబ్బు కావాలని, ఇంకొకరితో సంబంధం పెట్టుకున్నావని వేధిస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన కూడా యాకూబ్‌పాషా వచ్చి జుబేదా తలపై కర్రతో కొట్టడంతో గాయాలు కాగా పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,750	1,750
పెసలు	6,750	6,750
మిర్చి	14,500	5.000
ఏసీ మిర్చి	15,800	6,000
ఏసీ తాలు	7,300	5,000
పత్తి	7,150	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,506

ఎన్నాళ్లో వేచిన ఉదయం..



ఖమ్మంలోని జిల్లా జలవనరులశాఖ కార్యాలయం

- జలవనరుల శాఖలో పదోన్నతులు, బదిలీలకు గ్రీన్‌సిగ్నల్
- ఏళ్ల తర్వాత లభించిన మోక్షం
- తద్వారా ఖాళీల భర్తీ, తీరనున్న ఉద్యోగుల కొరత

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖలో ఖాళీలు త్వరలోనే భర్తీ కానున్నాయి. దాదాపు పదేళ్ల తర్వాత శాఖలో బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఖాళీల భర్తీకి మార్గం సుగమమైంది. ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇటీవల లష్కర్ల నియామకం కూడా చేపట్టడంతో నీటి వనరుల నిర్వహణ పటిష్టంగా చేపట్టేందుకు వీలవుతుందని భావిస్తున్నారు.

సాగర్ జలాలే ప్రధానం..

జిల్లాలో సాగుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలయ్యే నీరే ప్రధానం. నీటి విడుదల, కాలువల పర్యవేక్షణ బాధ్యతను జలవనరుల శాఖ అధికారులు చూస్తున్నారు. జిల్లాలోని 17 మండలాల పరిధిలో సాగర్ ప్రధాన కాల్వ విస్తరించి ఉంది. ఈ పరిధిలో 2.54 లక్షల ఎకరాలకు పైగా భూములకు నీరందించేలా ప్రధాన కాల్వకు అనుబంధంగా బ్రాంచ్ కాల్వలు, మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్లు నిర్మించారు. జిల్లాలో ప్రధాన కాల్వ సుమారు148 కి.మీ. మేర ఉండగా.. బోనకల్లు, మధిర, మైలవరం బ్రాంచ్ కాల్వలు 80 కి.మీ., మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్లు సుమారు 4వేల కి.మీ.కు పైగానే ఉన్నాయి. ఇక జిల్లాలో చెరువులు, చెక్‌డ్యామ్‌లు, లిఫ్టులు కలిపి మొత్తం 1,415 ఉన్నాయి. అయితే ఉద్యోగుల కొరతతో ఏళ్ల తరబడి కాల్వల మరమ్మతులపై దృష్టి పెట్టకపోగా, నిర్వహణ సైతం సరిగా లేకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు సరిగా అందడం లేదు.

శాఖ పటిష్టతకు ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం జలనవరులశాఖను పటిష్ట పరిచేందుకు చర్యలు చేపట్టింది. దీంతో జిల్లాలోనూ శాఖ బలోపేతం కానుంది. సుదీర్ఘకాలం తర్వాత పదోన్నతులు, బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా రాష్ట్ర విభజన తర్వాత గందరగోళంగా మారిన శాఖ నిర్వహణ గాడిన పడుతుందని చెబుతున్నారు. అంతేకాక ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీకి కానున్నాయి. అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ పూర్తి స్థాయిలో ఉంటే చిన్నపాటి సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించి పొలాలకు సజావుగా నీటి సరఫరా జరిగేలా చూస్తారు. అంతేకాక నీటి వృధాను అరికట్టి ప్రతీ చుక్కా వినియోగం అయ్యేలా చర్యలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

అరకొరత నిధులతో నిర్వహణ

కాల్వల్లో నీటి సరఫరా విషయమై చిన్నచిన్న సమస్యలు ఎదురైతే రైతుల సాయంతో లష్కర్లు మరమ్మతులు చేస్తారు. కొన్నేళ్లుగా లష్కర్ల నియామకం జరగకపోవడం, ఉన్న వారు ఉద్యోగ విరమణ చేస్తుండడంతో వందల్లో ఉండే వారు ఇప్పుడు పదుల సంఖ్యకు చేరారు. అలాగే, గతంలో ప్రధాన కాల్వతో పాటు ఒకటి, రెండు బ్రాంచ్ కాల్వల ఆధునికీకరణకు వచ్చిన నిధులతో పనులు చేపట్టారే తప్ప మిగతా కాల్వల నిర్వహణను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో కాల్వల్లో పూడిక, కంపచెట్లు పెరిగి.. కట్టలు కుంగి గందరగోళంగా మారాయి. లష్కర్లు లేకపోవడంతో చాలాచోట్ల నీరు వృథాగా పోతోంది. గతంలో ఎన్నెస్పీ, ఐడీసీ, ఐబీ విభాగాలు ఉండగా అన్నింటికీ ఇంజనీర్లు ఉండేవారు. అయితే, నీటి పారుదలశాఖలన్నీ ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చి జలవనరుల శాఖగా మార్చినా ఆ స్థాయిలో అధికారుల నియామకం లేక ఉన్న వారే పర్యవేక్షించాల్సి వస్తోంది.

జలవనరుల శాఖలో పోస్టులు, ఖాళీల వివరాలు

పోస్టు	కేటాయింపు	ఉన్నది
సీఈ	01	01
ఎస్ఈ	02	01
ఈఈ	06	6
ఏఈ	110	96
వర్క్ ఇన్‌స్పెక్టర్లు	25	25
లష్కర్లు	336	156
హెల్పర్లు	126	68
డీఈలు	35	32

జిల్లాలో ఇదీ పరిస్థితి..

ప్రస్తుతం జలవనరుల శాఖలో పలు కీలక పోస్టులు ఖాళీలు ఉన్నాయి. సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్‌గా.. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల సీఈ ఉద్యోగ విరమణ చేశారు. అలాగే, 35మంది డీఈలకు 32 మందే ఉన్నారు. ఖమ్మంరూరల్, సత్తుపల్లి, ఖమ్మం సర్కిల్ కార్యాలయాల్లో ఖాళీలు ఉన్నాయి. ఫలితంగా నీటి పంపిణీ, నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఏ చిన్న సమస్య వచ్చినా కొందరు అధికారులే చూసుకోవాల్సిన వస్తుండడంతో వారిపై భారం పడుతోంది.

200 మంది కేటాయింపు..

జిల్లాకు దాదాపు 336 మంది లష్కర్లకు గాను ప్రస్తుతం 156 మందే ఉన్నారు. ఇంకా 180 మంది ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. తక్కువ మంది ఉండటంతో లష్కర్లతో పర్యవేక్షణ లోపిస్తోంది. ఇటీవల ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా లష్కర్ల నియామకం చేపట్టగా జిల్లాలో 200 మంది నియామకానికి అనుమతి లభించింది. వీరి ఎంపిక ఏజెన్సీల ద్వారా పూర్తయితే చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు వీరు సహాయకారిగా ఉండనున్నారు.

పరస్పర సహకారంతో సమాజ అభివృద్ధి

మేయర్ నీరజ, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, మేయర్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఒకరికొకరు సహకరించుకుంటే అందరి అభివృద్ధి సాధ్యమై సమాజం పురోగమిస్తుందని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎస్‌టీఎఫ్ టీఎస్ ఆధ్వర్యాన సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో వారు మాట్లాడారు. సావిత్రిబాయి ఏళ్ల క్రితం వివక్ష ఉన్నప్పటికీ మహిళా విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. అనంతరం పలువురు మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఎస్‌టీఎఫ్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి డి.సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఐఈఓ రవిబాబు, డీఈఓ సోమశేఖరశర్మ, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త లెక్క ఇకపై పక్కాగా...

- కేఎంసీ పరిధిలో సేకరించిన వ్యర్థాల తూకం
- ఆపై నిర్వహణకు ఏర్పాట్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పరిధిలోని ఇళ్లు, వాణిజ్య, వ్యాపార సంస్థల నుండి సేకరిస్తున్న వ్యర్థాలను శాస్త్రీయంగా లెక్కకట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. డంపింగ్‌యార్డ్ సమస్యను పరిష్కరించేందుకు ఏరోజుకారోజు చెత్తను శుభ్రం చేసి, బయటకు తరలించే ప్రాజెక్టును ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయమై డీపీఆర్ తయారీకి అధికారులు చేసిన సూచనలతో ఓ సంస్థ బాధ్యులు కొద్దిరోజులుగా పరిశీలన చేపట్టారు. రోజువారీగా 180 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరిస్తుండగా, డంపింగ్‌యార్డ్‌కు మాత్రం 200 మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలు వస్తున్నాయని తేలింది. దీంతో రోజువారీ వచ్చే వ్యర్థాలను తూకం వేసేందుకు నిర్ణయించారు.

నేటి నుండి తూకం..

కేఎంసీ పరిధిలో సేకరించిన చెత్త, డంపింగ్ యార్డ్‌కు తరలించిన వ్యర్థాలను తూకం వేస్తారు. శనివారం నుండి నాలుగు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. తద్వారా సేకరించిన చెత్త, యార్డ్‌కు వచ్చిన చెత్తపై స్పష్టమైన లెక్కలు తేలనున్నాయి. ఈవిషయమై వాహనాల డ్రైవర్లకు ఇప్పటికే సూచనలు చేశారు. చెత్త సేకరణపై లెక్కలు తేలాక నిర్వహణపై ప్రైవేట్ ఏజెన్సీ బాధ్యులు డీపీఆర్ సిద్ధం చేసి కేఎంసీ అధికారులకు సమర్పించనున్నారు.

రూ.3లక్షల విలువైన ఉపకరణాలు పంపిణీ



వీల్‌చైర్ అందుకున్న దివ్యాంగుడితో ఎమ్మెల్యే రాగమయి దయానంద్

సత్తుపల్లి టౌన్: సేవా కార్యక్రమాలే తమకు సంతృప్తినిస్తాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పుట్టిన రోజు సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన నిరుపేదలకు రూ.3లక్షల విలువైన తోపుడుబండ్లు, సోలార్ లైట్లు, ట్రై సైకిళ్లు, గొడుగులు, పాఠశాలలకు ఐరన్ బీరువాలు ఎమ్మెల్యే రాగమయి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకోవడమే కాక ఆపన్నులకు అండగా నిలవడం తమ కర్తవ్యమని తెలిపారు. కాగా, నియోజకవర్గంలో ఎక్కడైనా కోడి పందేలు, పేకాట, జూదం వంటివి నిర్వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు వందనపు సత్యనారాయణతో పాటు సోమిశెట్టి శ్రీధర్, ఇమ్మనేని ప్రసాద్ దొడ్డా శ్రీనివాసరావు, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, తోట సుజలరాణి, చల్లగుల్ల నరసింహారావు, ఎండీ కమల్‌పాషా, చెన్నారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ చేసిన వారిని పట్టించిన సీసీ కెమెరా



స్థానికులు బంధించిన నిందితులు

నేలకొండపల్లి: వ్యాపారిని మాటల్లో పెట్టి నగదు చోరీ చేసిన వారిని సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా గుర్తించి పోలీసులకు అప్పగించిన ఘటన ఇది. మండల కేంద్రంలోని కొత్తా రమేష్ షాపునకు శుక్రవారం ఇద్దరు వ్యక్తులు వచ్చి బియ్యం అడిగారు. ఆయన శాంపిళ్లు తీసుకొచ్చేందుకు పక్క గదిలోకి వెళ్లగా సదరు వ్యక్తులు కౌంటర్‌లోని నగదు తీసి జేబులో పెట్టుకున్నారు. ఆ సమయాన పైఅంతస్తులో ఉన్న రమేష్ సతీమణి సీసీ కెమెరా పుటేజీని చూస్తూ ఈ విషయాన్ని గుర్తించారు. ఆమె ఫోన్‌లో చెప్పడంతో రమేష్ ప్రశ్నిస్తుండగా నిందితులిద్దరు పారిపోయేందుకు ఆటో ఎక్కారు. దీంతో ఆయన కేకలు వేయడంతో స్థానికులు ఆటోను అడ్డుకుని వారిని బంధించి రూ.7,700 స్వాధీనం చేసుకోవడంతో పాటు పోలీసులకు అప్పగించారు.

మందుపాతర పేలి ముగ్గురు జవాన్లకు గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబు పేలి ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా తోడ్కా గ్రామ సమీపంలో కూంబింగ్‌లో ఉన్న ఒక జవాను మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబును గుర్తించకుండా దానిపై కాలు వేయడంతో అది పేలి అతనితో పాటు అతని పక్కన ఉన్న మరో ఇద్దరు డీఆర్‌జీ జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన బీజాపూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన డీఆర్‌జీ జవాన్ల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు అక్కడి పోలీసులు తెలిపారు.

కారు సర్వీసింగ్ సెంటర్‌లో గంజాయి మొక్క



సెంటర్‌లో పెంచిన గంజాయి మొక్క

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఓ కారు సర్వీసింగ్ సెంటర్ యజమాని తన షెడ్డులో గంజాయి మొక్క పెంచుతున్నట్లు బయటపడింది. స్థానిక ఎన్నెస్పీ క్యాంపులో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి కూత వేటు దూరాన సెంటర్ యజమాని టైర్ రక్షణగా పెట్టి గంజాయి మొక్క పెంచుతున్నాడని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఖమ్మం టూటౌన్, ఎక్సైజ్ సిబ్బంది ఆ మొక్కను స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఇదొక్కటే మొక్క పెంచుతున్నాడా, ఇంకా ఎక్కడైనా ఉన్నాయా, గతంలోనూ విక్రయించాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఎత్తుకెళ్లారు.. తెచ్చి పెట్టారు!

మధిర: మధిర రైల్వేస్టేషన్ నంబర్–2 ప్లాట్‌ఫామ్ వైపు నిలిపిన ద్విచక్ర వాహనం గురువారం రాత్రి చోరీకి గురైంది. స్టేషన్‌లో క్లీనింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జిలుగుమాడుకి చెందిన గద్దల వెంకటేశ్వర్లు తన బైక్‌పై వచ్చి పార్క్ చేశాక విధులకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైక్ లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, సాయంత్రంకల్లా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌ను అక్కడే పార్క్ చేసి వెళ్లడంతో వెంకటేశ్వర్లు ఊపిరిపీల్చుకున్నాడు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మధిర: మధిర రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి చోరీ జరిగింది. మధిరకు చెందిన రమణ తన భర్తతో కలిసి ఖమ్మం ఆస్పత్రికి వెళ్లి శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో వచ్చింది. ఆమె రైలు దిగుతుండగా హఠాత్తుగా ఓ వ్యక్తి ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కునే ప్రయత్నం చేశాడు. దీంతో రమణ గొలుసును గట్టిగా పట్టుకోగా అది నిందితుడి చేతిలోకి సగం మేర మిగలడంతో పరారయ్యాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలుకింద పడి వృద్ధుడి ఆత్మహత్య

చింతకాని: మండలంలోని అనంతసాగర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపాన గుర్తుతెలియని వృద్ధుడు(60) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం రాత్రి సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ వెళ్తుండగా సదరు వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గరిష్ట వేగంతో రైలు వెళ్తున్న క్రమాన ఈ ఘటన జరగడంతో వృద్ధుడి శరీర భాగాలు గుర్తుపట్టలేనంతగా ముక్కలైపోయాయి. జీఆర్పీ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో అన్నం సేవా ఫౌండేషన్ బాధ్యులు శరీరభాగాలనుసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

విద్యుదాఘాతంతో తీవ్రగాయాలు

బోనకల్: మండలంలోని మోటమర్రి రైల్వేస్టేషన్ వద్ద విద్యుత్ పనులు చేస్తుండగా ఓ వ్యక్తికి షాక్‌తో తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రకు చెందిన గజానన్ గణపతి దూకరే మరికొందరి తో కలిసి ఇక్కడ లైన్ పనులు చేస్తున్నాడు. ఈక్రమాన శుక్రవారం ఆయన పనిచేస్తూ విద్యుదా ఘాతానికి గురి కాగా శరీరమంతా కాలిపోయింది. ఈమేరకు గజానన్‌ను 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కారేపల్లి: మండలంలోని మంగల్‌తండా శివారు చెరువు వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారు కాగా, పట్టుబడిన నలుగురి నుంచి రూ.2,020 నగదుతో పాటు ఫోన్లు, బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై రాజారాం తెలిపారు.

జీఎస్టీ చట్టాలపై అవగాహన అవసరం

వరంగల్ జాయింట్ కమిషనర్ శశిధరాచారి



మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ శశిధరాచారి

ఖమ్మంగాంధీచౌక్: వస్తు సేవా పన్నుపై వివిధ వర్గాల వారికి అవగాహన పెంపొందించాలని వరంగల్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ రావుల శశిధరాచారి సూచించారు. జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ అధ్యక్షతన ఖమ్మంలో శుక్రవారం జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వస్తు సేవా పన్ను, సాంకేతికతపై వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రాక్టీషనర్ల అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు రంగి నగేష్ మాట్లాడుతూ జీఎస్టీపై సమగ్ర అవగాహన లేక పన్ను చెల్లింపుదారులు వడ్డీ, జరిమానా కట్టాల్సి వస్తోందన్నారు. సాంకేతిక సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో కృషి జరగాల్సి ఉందని తెలిపారు. అనంతరం ఏపీ జీఎస్టీ, వ్యాట్, జీఎస్టీ విధివిధానాలను వివరించగా, ప్రొఫెషనల్స్ ఎదుర్కొంటున్న సమస్యలపైనా చర్చించారు.

నూతన అధ్యక్షుడి సైదులు

జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఈ సమావేశంలో ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా ఉల్లిబోయిన సైదులు, ప్రధాన కార్యదర్శిగా కె.పవన్‌కుమార్, కోశాధికారిగా జి.రమేష్‌తో కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చుండూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాసికి సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగపూరి రోజా

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఖానాపురం హవేలీకి చెందిన ఇంగ్లిష్ లెక్చరర్ నాగపూరి రోజా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ప్రకటించిన రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. హైదరాబాద్‌లోని రైల్వే కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమెకు ఉత్తమ బోధనతో పాటు సమాజ సేవా కార్యక్రమాలకు గాను అవార్డు ప్రకటించింది. ఈ మేరకు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమెకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అవార్డు అందజేశారు. ఈకార్యక్రమంలో మంత్రి సీతక్క, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోజా మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడంపై బీసీ సంక్షేమ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మెడికోలకు మెరుగైన బోధన, సౌకర్యాలు



హాస్టల్‌లో ఏర్పాటు చేసిన జిమ్ వద్ద ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు బోధనతో పాటు ఆరోగ్యం, ఆహ్లాదం కోసం జిమ్ ఏర్పాటుచేశామని వెల్లడించారు. బాలికలు, బాలుర హాస్టళ్లలో సుమారు రూ. 4లక్షల వ్యయంతో జిమ్‌లు ఏర్పాటుచేశామని, టెన్నిస్, వాలీబాల్, షటిల్, కబడ్డీ, క్రికెట్ తదితర క్రీడల కోసం కోర్టులు సిద్ధం చేశామని తెలిపారు. గత ఏడాది విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో ఈ ఏడాది ఇక్కడ చేరేందుకు ఆసక్తి కనబరిచారని పేర్కొన్నారు. ఈనేపథ్యాన మెరుగైన బోధన చేస్తూనే ర్యాగింగ్ జరగకుండా చూడడంతో పాటు ఇతర అంశాలపై 14 కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక బాలికల హాస్టళ్లలో సీసీ కెమెరాలు, 24 గంటల పాటు సెక్యూరిటీ సిబ్బందితో నిఘా కొనసాగుతోందని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

గ్రామగ్రామాన పార్టీ విస్తరణ



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్‌జీ

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీని గ్రామగ్రామాన విస్తరించేలా కార్యాచరణ రూపొందించాలని పార్టీ నాయకుడు పేరాల శేఖర్‌జీ సూచించారు. ఖమ్మంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నమోడీ నేతృత్వాన జరుగుతున్న అభివృద్ధి, రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో విఫలమైన అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. రైతుభరోసా, మహిళలకు ఆర్థిక సాయం తదితర హామీలను విస్మరించిన విషయాన్ని వివరిస్తూ పార్టీ బలోపేతానికి పాటుపడాలని చెప్పారు. తద్వారా త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించొచ్చని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు తాండ్ర వినోదరావు, గెంటేల విద్యాసాగర్, సన్నె ఉదయప్రతాప్, సుగ్గల వెంకటగుప్తా, వక్కలంక సుబ్రహ్మణ్యం, నంబూరి రామలింగేశ్వరరావు, దొంగల సత్యనారాయణ, ఈ.వీ.రమేష్, నరేందర్‌రావు, డాక్టర్ శీలం పాపారావు, నున్న రవికుమార్, పెరుమమాళ్లపల్లి విజయరాజు, చావా కిరణ్, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉపకారానికి మోక్షం

రూ.80 కోట్లు విడుదలకు సీఎం గ్రీన్‌సిగ్నల్

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: గిరిజన విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు ఊరట లభించింది. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ కోర్సులు చదివిన ఎస్టీ విద్యార్థుల ఖాతాల్లో అతి త్వరలో నిధులు జమ కానున్నాయి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం వాటాను విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విడుదల చేయలేదు. ఈ అంశంపై 'రాష్ట్ర వాటా విడుదల ఎప్పుడో..!' శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల (75శాతం)కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ (25శాతం)ను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.80 కోట్ల విడుదలకు చర్యలు చేపట్టారు. ఈ నిధులు విడుదల కావడంతో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి గిరిజన విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు పూర్తికానున్నాయి. అలాగే ఎస్సీ విద్యార్థుల ఫీజు బకాయిలను కూడా వెనువెంటనే విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

'క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్'లో

వీఐటీకి 8వ ర్యాంకు

సాక్షి, హైదరాబాద్: క్యూఎస్ 'వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్: సస్టెయినబిలిటీ–2025' 3వ ఎడిషన్‌లో వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) ప్రపంచవ్యాప్తంగా 1,744 విద్యాసంస్థల్లో 396వ ర్యాంకు సాధించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన 78 విద్యాసంస్థలు స్థానం సంపాదించగా అందులో వీఐటీ 8వ ర్యాంకు పొందినట్లు వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 53 స్థానాలు మెరుగుపరుచుకున్నట్లు పేర్కొంది. భారత్‌లో ఈ ర్యాంకింగ్స్‌లో ఐఐటీ ఢిల్లీ టాప్ ర్యాంకును సాధించింది.

'సుప్రీం' కేసులో ఇంత నిర్లక్ష్యమా..?

'మార్గదర్శి'పై మరెన్నాళ్లు?

ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలపై తెలంగాణ హైకోర్టు మండిపాటు

మూడు వారాల్లో కౌంటర్లు వేయాల్సిందే.. ఇదే చివరి అవకాశం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి: మార్గదర్శి ఫైనాన్షియర్స్ భారీ ఆర్థిక అవకతవకలపై కౌంటర్లు దాఖలు చేయాలన్న తమ ఆదేశాలను పట్టించుకోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇంకా ఎన్నాళ్లకు కౌంటర్ దాఖలు చేస్తారని ఇరు ప్రభుత్వాలను నిలదీసింది. స్వయంగా సుప్రీం కోర్టు విచారణకు పంపిన కేసులో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత మాత్రం సహించరానిదంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. గత జూన్‌లో విచారణ ప్రారంభించి ఇప్పటి వరకు 13 సార్లు వాయిదాలు వేశామని గుర్తు చేసింది. కౌంటర్లు దాఖలు చేస్తామని గత విచారణ సమయంలోనే చెప్పారని, అయినప్పటికీ కౌంటర్ దాఖలు చేయపోవడానికి కారణాలేంటో చెప్పాలని నిలదీసింది. మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఇదే చివరి అవకాశమని తేల్చి చెప్పింది. లేని పక్షంలో తదుపరి విచారణకు తమ ముందు హాజరు కావాలని ఇరు రాష్ట్రాల సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులను ఆదేశించింది. అదనపు కౌంటర్ దాఖలు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి మూడు వారాల గడువునిచ్చింది. అంతేకాక రిప్లై కాపీని మాజీ ఎంపీ, కోర్టు సహాయకుడు ఉండవల్లి అరుణ్ కుమార్‌కి అందచేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త చెరుకూరి కిరణ్‌లను హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 31వతేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

'సుప్రీం' ఆదేశాలతో హైకోర్టు విచారణ..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించిన మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కేసులో అధీకృత అధికారి నాంపల్లి కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ ఫిర్యాదును కొట్టేస్తూ 2018 డిసెంబర్ 31న ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశాయి. అదే విధంగా హైకోర్టు తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రామోజీ, మార్గదర్శి వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశాయి. ఈ అప్పీళ్లన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ దాన్ని రద్దు చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై తిరిగి విచారణ చేపట్టాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, రిజర్వ్ బ్యాంక్, ఏపీ సర్కార్‌తో సహా అందరి వాదనలు వినాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. గతేడాది నవంబర్ 7న విచారణ సందర్భంగా మార్గదర్శి ఆర్థిక అవకతకవలపై పూర్తి వివరాలతో నాలుగు వారాల్లో కౌంటర్లు దాఖలు చేస్తామని ఇరు రాష్ట్ర ప్రభుత్వాల న్యాయవాదులు హైకోర్టుకు నివేదించిన విషయం తెలిసిందే. అయితే ఇరు ప్రభుత్వాలు కౌంటర్లు దాఖలు చేయలేదు. తాజాగా ఈ వ్యాజ్యాలపై జస్టిస్ సుజోయ్ పాల్ ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కోర్టు సహాయకుడిగా మాజీ ఎంపీ అరుణ్‌కుమార్, ఆర్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణ్ రవిచందర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది (ఎస్‌జీపీ) బి.రాజేశ్వర్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు.



6వతేదీ కల్లా ఉండవల్లికి ఆ కాపీలు ఇవ్వండి

ఆర్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణన్ రవిచందర్ స్పందిస్తూ 200కిపైగా పేజీలతో మార్గదర్శి ఫైనాన్సియర్స్, చెరుకూరి కిరణ్ గత నెల 19న రిప్లై దాఖలు చేశారని, దీనిపై తాము పూర్తి వివరాలతో అదనపు కౌంటర్ దాఖలు చేస్తామని నివేదించారు. ఇందుకు మూడు వారాల గడువునివ్వాలని కోరారు. అయితే కోర్టు ఆదేశాలు జారీ చేసినా కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఇప్పటి వరకు కౌంటర్లు దాఖలు చేయలేదని ఆయన ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ సమయంలో ఉండవల్లి అరుణ్ కుమార్ స్పందిస్తూ.. కోర్టు ఆదేశించినప్పటికీ మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన రిప్లై కాపీని తనకు ఇవ్వలేదని ధర్మాసనానికి నివేదించారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ ఈ నెల 6వతేదీలోపు ఆ రిప్లై కాపీని ఉండవల్లి అరుణ్ కుమార్‌కి అందజేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ని ఆదేశించింది.

కోర్టు ఆదేశాలను ఇలాగేనా అమలు చేసేది..?

విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం ఇరు రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంకెన్నాళ్లకు కౌంటర్లు దాఖలు చేస్తారని నిలదీసింది. సుప్రీంకోర్టు పంపిన వ్యాజ్యాల్లోనూ ఇలా చేస్తే ఎలా? అంటూ మండిపడింది. కోర్టు ఆదేశాలను అమలు చేసేది ఇలాగేనా? అని నిలదీసింది. మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఇరు ప్రభుత్వాలను ఆదేశించింది. అదనపు కౌంటర్ దాఖలు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్‌కి మూడు వారాల గడువునిచ్చేందుకు ఇరుపక్షాలు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. దీంతో ధర్మాసనం ఉత్తర్వుల జారీకి సిద్ధమైంది. ఈ సమయంలో మార్గదర్శి తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అడ్డుకుని మాట్లాడటంపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. అనంతరం విచారణను ఈ నెల 31కి వాయిదా వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ల దాఖలు విషయంలో తమ ఆదేశాల అమలు నిమిత్తం ఉత్తర్వుల కాపీని అడ్వొకేట్ జనరల్ కార్యాలయానికి సోమవారంలోగా పంపాలని హైకోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

వేల కోట్లు కొల్లగొట్టిన మార్గదర్శి ఫైనాన్షియర్స్

రామోజీరావు 1972లో హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఏర్పాటు చేశారు. 1997లో కేంద్ర ప్రభుత్వం ఓ చట్టం తెచ్చింది. హెచ్‌యూఎఫ్ లాంటి అన్ ఇన్ కార్పొరేటెడ్ (చట్టపరంగా ఓ కంపెనీగా రిజిష్టర్ కాకుండా వ్యాపారం చేసేవి) సంస్థలు వ్యాపార కార్యాలయాల కోసం ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడాన్ని అది నిషేధించింది. అయినప్పటికీ రామోజీరావు నేతృత్వంలోని మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్‌బీఐ చట్ట నిబంధనలను ఉల్లంఘించి దాదాపు 2.75 లక్షల మంది డిపాజిటర్ల నుంచి 2006 మార్చి నాటికి దాదాపు రూ.2,610.38 కోట్లు వసూలు చేసింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా రామోజీరావు ప్రజల నుంచి చట్ట విరుద్ధంగా డిపాజిట్లు స్వీకరించడంపై అప్పటి కాంగ్రెస్ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ 2006 నవంబర్ 6న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేశారు. చట్ట విరుద్ధంగా మార్గదర్శి సేకరించిన డిపాజిట్ల వివరాలను ఆర్‌బీఐ అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని ఆర్‌బీఐ స్పష్టంగా చెప్పింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం తమకు లేదని ఆర్‌బీఐ చేతులెత్తేయడంతో డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించే నిమిత్తం మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావులపై అప్పటి ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది.

అక్రమాలను నిర్ధారించిన రంగాచారి

మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలు, అవకతవకలను నిగ్గు తేల్చి నివేదిక ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు (ఫైనాన్స్) ఎన్.రంగాచారిని నియమిస్తూ 2006 డిసెంబర్ 19న జీవో 800 జీవో జారీ అయింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై చట్ట ప్రకారం న్యాయస్థానాల్లో ఫిర్యాదు చేసేందుకు, తదనుగుణంగా చర్యలు తీసుకునేందుకు ఐపీఎస్ అధికారి టి.కృష్ణరాజును అధీకృత అధికారిగా నియమిస్తూ అదే రోజు జీవో 800 వెలువడింది. దీంతో తమ అక్రమాలు బయటపడటం ఖాయమని పసిగట్టిన మార్గదర్శి, రామోజీరావులు.. రంగాచారి, కృష్ణరాజు నియామకాలను సవాలు చేస్తూ సుదీర్ఘ కాలం న్యాయస్థానాలను ఆశ్రయించారు. అయితే రామోజీరావుకు అటు హైకోర్టు, ఇటు సుప్రీంకోర్టులోనూ చుక్కెదురైంది. ఈ క్రమంలో తాము కోరిన వివరాలు మార్గదర్శి ఇవ్వకపోవడంతో రంగాచారి ఆదాయ పన్ను శాఖ నుంచి అవసరమైన డాక్యుమెంట్లను సేకరించి పరిశీలించారు. 2007 ఫిబ్రవరి 19న తన నివేదికను ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లు సేకరించడం నిజమేనని తేల్చారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, అది డిపాజిట్లను తిరిగి చెల్లించే స్థితిలో లేదని ఆయన అందులో స్పష్టంగా పేర్కొన్నారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా ప్రజల నుంచి సేకరించిన డిపాజిట్లను రామోజీరావు తన అనుబంధ కంపెనీలకు మళ్లించడమే నష్టాలకు ప్రధాన కారణమని రంగాచారి తన విచారణ ద్వారా తేల్చారు.

అధీకృత అధికారి ఫిర్యాదు కొట్టేసిన హైకోర్టు

చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని హెచ్‌యూఎఫ్ కర్త రామోజీ రావులను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి టి.కృష్ణరాజు 2008 జనవరి 23న నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు (సీసీ నెంబర్ 540) చేశారు. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధమని, అయితే మార్గదర్శి ఫైనాన్షియర్స్ అందుకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించి నేరం చేసిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 58 ప్రకారం శిక్షార్హమని తెలిపారు. దీంతో రామోజీరావు ఈ ఫిర్యాదు విషయంలో మళ్లీ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించారు. చివరకు హైకోర్టు 2018 డిసెంబర్ 31న రామోజీరావుపై అధీకృత అధికారి చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ తీర్పునిచ్చింది.

హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీంకోర్టు

ఈ తీర్పుపై అటు ఉండవల్లి అరుణ్ కుమార్, అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అలాగే హైకోర్టు తీర్పులో కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీ కూడా సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. వీటన్నింటిపై సుప్రీంకోర్టు 2020 నుంచి విచారిస్తూ వచ్చింది. అటు తరువాత ఈ వ్యాజ్యాల్లో ఆర్బీఐని కూడా ప్రతివాదిగా చేర్చింది. విచారణ సందర్భంగా ఆర్‌బీఐ తరఫు న్యాయవాది కూడా మార్గదర్శి, రామోజీరావు చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డారని మౌఖికంగా కోర్టుకు తెలిపారు. చివరగా గతేడాది ఏప్రిల్ 9న సుప్రీంకోర్టు ఈ వ్యాజ్యాలన్నింటిపై విచారణ జరిపింది. చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి కృష్ణరాజు నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఇదే సమయంలో డిపాజిట్లు తిరిగి ఇచ్చేశాం కాబట్టి తనపై కేసులు కొట్టేయాలంటూ రామోజీ, మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన అభ్యర్థనలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ చట్ట విరుద్ధంగా సేకరించిన డిపాజిట్లపై నిగ్గు తేలాల్సిందేనని తేల్చి చెప్పింది. కేసు లోతుల్లోకి వెళ్లి అందరి వాదనలు వినాలని తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేసింది. ఈ ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు విచారణ నిర్వహిస్తోంది.

జిల్లా వార్తలు

జేఈఓలకు పోస్టింగ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా ఇటీవల ఆరుగురు జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ల (జేఈఓ)ను నియమించారు. గ్రేడ్–1 ఉద్యోగులైన వీరికి వివిధ ఏరియాల్లో పోస్టింగ్ ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో వాసం దీపక్‌ను భూపాలపల్లి జేఈఓగా, నేరెళ్ల మహేశ్‌గౌడ్‌ను శ్రీరాంపూర్ ఏరియాకు, మారేడు మధుమితను కొత్తగూడెం ఏరియాకు, నేరెళ్ల నిరేశ్‌గౌడ్‌ను ఆర్జీ–1 ఏరియాకు, భూక్యా రజనీకాంత్‌ను బెల్లంపల్లికి, ఆసిఫ్ మహ్మద్‌ను మందమర్రి ఏరియా జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్‌గా కేటాయించారు.

టీఎన్జీవోస్ రాష్ట్ర కమిటీని కలిసిన జిల్లా నాయకులు



రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్‌ను హైదరాబాద్‌లో శుక్రవారం ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ బాధ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి పాటుపడతామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో టీఎన్జీవోస్ నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, కొణిదెన శ్రీనివాస్, దుర్గాప్రసాద్, బాలకృష్ణ, జడ్‌ఎస్ జైపాల్, విజయకుమార్, వల్లపు వెంకన్న, తాళ్లూరి శ్రీకాంత్, ఎర్రా రమేష్, ఎస్.లలితకుమారి, ఏలూరి హరికృష్ణ, పెద్దినేని రాధాకృష్ణ, ఎం.డీ.అస్లాం, టి.వీంద్ర బాబు, బి.నాగలక్ష్మి, అవినాష్, రజనీకాంత్, శంకర్, రవిచంద్ర, కంచే శ్రీనివాస్, గుర్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

ఖమ్మంఅర్బన్: టాస్క్‌ఫోర్స్, ఖమ్మం అర్బన్ పోలీసులు శుక్రవారం సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో ముగ్గురు పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. ఖమ్మంలోని కై కొండాయిగూడెం సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించగా ముగ్గురు పట్టుబడ్డారని, మరో నలుగురు పారిపోయారని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. వీరి నుంచి రూ.1,950తో పాటు బైక్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

సమయం లేదు మిత్రమా..

- బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు మూడు నెలలే గడువు
- ఇంకా 25.24 మిలియన్ టన్నుల మిగులు
- రోజుకు 2.80 టన్నుల ఉత్పత్తి సాధిస్తే లక్ష్యానికి చేరువ
- 2023–24 మినహా గత ఎనిమిదేళ్లలోనూ వెనుకంజే



ఓసీలో బొగ్గు లోడ్ చేస్తున్న వాహనం

సింగరేణి(కొత్తగూడెం): ఏటా వర్షాలు కురుస్తాయి.. ఆ సమయాన బొగ్గు ఉత్పత్తికి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయని అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, తీరా ఆర్థిక సంవత్సరం ముగిసే సమయాన బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు కార్మికులపై ఒత్తిడి పెంచడం అధికారులకు షరామామూలుగా మారింది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా ఉత్పత్తిలో వెనకబడే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం గడిచిన 9 మాసాల్లో 46.76 మిలియన్ టన్నులు ఉత్పత్తి నమోదవగా, మిగిలిన మూడు నెలల్లో లక్ష్యాన్ని ఎలా చేరతారనే సందిగ్ధత నెలకొంది.

రోజుకు 2.28 లక్షల టన్నులే

సింగరేణి సంస్థ 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో 46.76 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదు కాగా మిగిలిన మూడు నెలల్లో సాధించాల్సింది 25.24 మిలియన్ టన్నుల ఉత్పత్తి. ఈ లక్ష్యాన్ని చేరేందుకు రోజూ 2.70 లక్షల టన్నుల ఉత్పత్తి నమోదు కావాలి. కానీ 2.27 లక్షల టన్నులకు మించడం లేదు. ఫలితంగా లక్ష్యానికి చేరువయ్యే పరిస్థితి కానరావడం లేదనే చర్చ జరుగుతోంది.

ఆరు ఏరియాల్లోనే 100 శాతం

సంస్థ ప్రతీనెలా ఏరియాల వారీగా లక్ష్యాలను కేటాయిస్తుంది. అయితే, అధికారుల పర్యవేక్షణ లోపమో, ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయో తెలియదు కానీ కొన్ని ఏరియాలు మాత్రమే 100 శాతం ఉత్పత్తి సాధిస్తున్నాయి. కార్మికులు అధికంగా ఉన్న రామగుండం రీజియన్‌లోని శ్రీరాంపూర్ ఏరియాల్లోనే అత్యధికంగా వెనకబాటు కనిపిస్తోంది. కానీ, డిసెంబర్‌లో మాత్రం శ్రీరాంపూర్ ఏరియా 114 శాతం ఉత్పత్తి సాధించి కొంత పుంజుకుంది. డిసెంబర్‌లో సింగరేణివ్యాప్తంగా 67,17,500 టన్నుల లక్ష్యానికి 66,06,966 టన్నుల (98 శాతం) ఉత్పత్తి నమోదయ్యాయి. ఇందులో కొత్తగూడెం ఏరియా 109 శాతం, ఇల్లెందు ఏరియా 118, మణుగూరు 107, శ్రీరాంపూర్ 114 శాతం, ఆర్జీ–3 100 శాతం, ఆండ్రియాల 145 శాతం సాధించాయి. ఇక బెల్లంపల్లి ఏరియా 91 శాతం, మందమర్రి 82 శాతం, ఆర్జీ–1 ఏరియా 98 శాతం, ఆర్జీ–2 ఏరియా 81 శాతం, భూపాలపల్లి ఏరియా 74 శాతంతో వెనుకంజలో ఉన్నాయి. మొత్తంగా అన్ని ఏరియాల్లోని భూగర్భగనుల్లో 4,89,500 టన్నుల లక్ష్యానికి, 3,54,737 టన్నులు (72శాతం), ఓసీల్లో 62,28,000 టన్నుల లక్ష్యానికి 62,52,229 టన్నులు 100 శాతం ఉత్పత్తి నమోదైంది.

గడిచిన కొన్నేళ్లలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, ఉత్పత్తి

ఆర్థిక సంవత్సరం	లక్ష్యం	ఉత్పత్తి
	(మిలియన్ టన్నుల్లో)	
2016-17	62.00	61.34
2017-18	66.06	62.01
2018-19	70.00	64.00
2019-20	70.00	64.02
2020-21	70.50	50.58
2021-22	70.53	65.02
2022-23	74.00	67.14
2023-24	70.00	70.21

వార్షిక ఉత్పత్తిలో ఇల్లెందు టాప్

ఈ ఆర్థిక సంవత్సరం గడిచిన తొమ్మిది నెలల్లో పరిశీలిస్తే సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో ఇల్లెందు మొదటి స్థానంలో నిలిచింది. ఇల్లెందు ఏరియా 125 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, అడ్రియాల 105, కొత్తగూడెం ఏరియా 98 శాతం, మణుగూరు 92 శాతం, బెల్లంపల్లి 91, మందమర్రి 73, శ్రీరాంపూర్ 78, ఆర్జీ–1 ఏరియా 90, ఆర్జీ–2 ఏరియా 95, ఆర్జీ–3 ఏరియా 98, భూపాలపల్లి 74 శాతం ఉత్పత్తి సాధించాయి. ఇక సంస్థ మొత్తంలో తొమ్మిది మాసాలకు గాను 46.76 మిలియన్ టన్నుల్లో కొత్తగూడెం ఏరియా 10 మిలియన్ టన్నులు నమోదు చేయడం విశేషం.

అంతా 8 గంటలు పనిచేయాల్సిందే



సంస్థ ఉజ్వల భవిష్యత్ కోసం అందరూ 8 గంటల పాటు పనిచేయాలి. రక్షణ సూత్రాలు పాటిస్తూనే యంత్రాల పని గంటల పెంపు, ఉత్పత్తి వ్యయం తగ్గింపునకు కృషి చేయాలి. లక్ష్య సాధనకు రోజువారీ బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారిస్తేనే ఫలితం ఉంటుంది. లక్ష్యాల సాధన సాఫీగా సాగేలా గతంలో మాదిరిగా గనుల్లో పోటీలు పెట్టే ఆలోచన ఉంది. ఈ సమయాన నిబద్ధతగా పనిచేసే వారికి గుర్తింపు, నిర్లక్ష్యంగా పనిచేసే వారి మదింపు ఉంటుంది.

–ఎన్.బలరామ్, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్

సింగరేణిలో 8 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎనిమిది మంది అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్తగూడెం ఏరియా జేవీఆర్ ఓసీ–2 ఎస్‌ఓఎం పి.నర్సింహారావును మణుగూరులోని కేపీయూజీ గనికి, మణుగూరు ఓసీ సూపరింటెండెంట్ ఆఫ్ మైన్స్ బెజ్జంకి రాజేశ్వరరావును కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ ఓసీ–2కి, మణుగూరు కేపీయూజీ గని అడిషినల్ మేనేజర్ బి.వెంకటేశ్వర్లును మణుగూరు ఓసీకి, భూపాలపల్లి ఏరియా కేటీకే–1 ఇంక్‌లైన్ గని అడిషినల్ మేనేజర్ ఎం.జాన్సన్‌ను ఆర్జీ–1లోని జీడీకే–11 ఇంక్‌లైన్ గనికి బదిలీ చేశారు. అలాగే, ఆర్జీ–1లోని జీడీకే–11 ఇంక్‌లైన్ అడిషినల్ మేనేజర్ జి.మహేశ్‌ను ఆర్జీ–3 ఏరియా ఓసీ–2కి, ఆర్జీ–1లోని జీడీకే–11 ఇంక్‌లైన్ అడిషినల్ మేనేజర్ రావూరి చంద్రశేఖర్‌రావును భూపాలపల్లిలోని కేటీకే–8 ఇంక్‌లైన్ గనికి, కొత్తగూడెం జేవీఆర్ ఓసీ అడిషినల్ మేనేజర్ గౌతం రాజేశ్‌రెడ్డిని బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీకి, మణుగూరు పీకేఓసీలో ఎస్‌ఈ (ఎస్‌ఎంఎంసీ) వి.నాగరమేశ్‌ను మణుగూరులోని క్వాలిటీ మేనేజ్‌మెంట్ విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యను బలోపేతం చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా నర్సరీ, కేజీ క్లాసులు ప్రవేశపెట్టడమే కాక తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని యూటీఎఫ్ భవనంలో జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల విడుదల, జూలై 2023 నుంచి రెండో పీఆర్సీ అమలు, పాత పెన్షన్ పునరుద్ధరణపై నిర్ణయాన్ని వెలువరించడమే కాక ఇతర పెండింగ్ బిల్లులన్నీ సత్వరమే చెల్లించాలని ఆయన కోరారు. అలాగే, ఎస్ఎస్ఏ సిబ్బంది సర్వీసును క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు నాగమల్లేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, ఎల్లయ్య, లివిన్, మహేశ్, రాందాస్, నాగేశ్వరరావు, సుధాకర్, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల్లో మెరుగైన వసతులు

ఐటీడీఏ పీఓ రాహుల్



సమీక్షలో మాట్లాడుతున్న పీఓ రాహుల్, పక్కన అధికారులు

భద్రాచలం: గిరిజన పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా ప్రణాళిక రూపొందించామని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఆయన స్పెషలాఫీసర్లు, హెచ్‌ఎంలు, వార్డెన్లతో సమావేశమయ్యారు. పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులపై నివేదికలు సమర్పించాలని, తాగునీరు, ప్రహరీల నిర్మాణంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. వచ్చే వానాకాలంలో శ్లాబ్‌ల లీకేజీ కాకుండా ముందుగానే పనులు చేపట్టాల్సి ఉందన్నారు. స్పెషల్ ఆఫీసర్లు, హెచ్‌ఎంలు తమకు కేటాయించిన పాఠశాలలను తప్పనిసరిగా వారానికి రెండుసార్లు రెండు పూటలా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎస్సెస్సీ విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించేలా ఇప్పటి నుంచే ప్రత్యేక బోధన చేపట్టాలని, ఇదే సమయాన వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంక్రాంతి సెలవులు ముగియగానే పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులకు సూచనలు చేయాలన్నారు. కాగా, జనవరిలో సైన్స్ ప్రయోగాలతో కూడిన ప్రత్యేక వాహనం అన్ని పాఠశాలలకు వస్తుందని, దీని ద్వారా విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంపొందించాలని పీఓ సూచించారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ భద్రాద్రి, ఖమ్మం డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, అధికారులు రమణయ్య, శ్రీరాములు, జహీరుద్దీన్, అశోక్ కుమార్, సత్యవతి, రాధమ్మ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కామన్ ఎంట్రన్స్ టెస్టు పోస్టర్లు ఆవిష్కరణ

2025–26 విద్యాసంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ప్రవేశానికి నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పోస్టర్లను ఐటీడీఏ పీఓ రాహుల్ శుక్రవారం ఆవిష్కరించారు. ఐదో తరగతిలో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించనుండగా, 6 నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్స్ సీట్లు కూడా భర్తీ చేస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 1వ తేదీ లోపు https://tgcet.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, సర్టిఫికెట్ల సత్వర జారీ కోసం కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గురుకులాల ఆర్‌సీఓ నాగార్జున్‌రావు, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీలకు ఉపాధ్యాయుల కేటాయింపు

నేలకొండపల్లి: సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది సమ్మెలో ఉండడంతో వారు చేసే పనులకు ఆటంకం ఎదురుకాకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రతీ మండల విద్యావనరుల కేంద్రానికి ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులను కేటాయించారు. మండలాల్లోని పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయుల ఉన్న చోట, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారిని ఎంపిక చేసి ఉన్నతాధికారులకు జాబితా అందజేశారు. ఈమేరకు నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమేష్, కోరట్లగూడెం ఉపాధ్యాయుడు వేణును నేలకొండపల్లి ఎమ్మార్సీకి కేటాయించినట్లు ఎంఈఓ బి.చలపతిరావు తెలిపారు. ఇదే తరహాలో జిల్లావ్యాప్తంగా ఎమ్మార్సీలకు ఉపాధ్యాయుల కేటాయింపు కొనసాగుతుంది. మధ్యాహ్న భోజనం ఏజెన్సీల బిల్లుల తయారీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల వివరాలు, పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తుల కేటాయింపు, విద్యార్థుల హాజరు విధులను వీరు నిర్వర్తించాల్సి ఉంటుంది.